క్లుప్తంగా

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ శిక్షణ తరగతులు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.బాలసుందరం మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కమిటీతో పాఠశాల అభివృద్ధి, ఇతర పనులపై చర్చించామని తెలిపారు. ఎప్పటికప్పుడు పాఠశాల ఆవరణ పరిశుభ్రత, మధ్యాహ్న భోజన తనిఖీ, విద్యార్థుల హాజరు తదితరాలు ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా నిర్ణయాలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆర్పీలు బి.బ్రహ్మయ్య, శ్రీనివాస చక్రవర్తి, ఉన్నం ప్రసాద్, ఎస్ఎంసీ రాంబాబు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

ఫిరంగిపురం: ఈ నెల 5న విజయవాడలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన హైందవ శంఖారావం సభకు తరలిరావాలని సమరసతా సేవా ఫౌండేషన్ మండల అధ్యక్షురాలు గుంటుపల్లి అశ్విని కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ దేవాలయాల నిర్వహణలో ఉన్న లోటుపాట్లు, సంస్కరణలు వంటి పలు అంశాలపై నిర్వహిస్తున్న ఈ సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

మూడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, రేపూడి, వేమవరం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జె. వాసంతి మాట్లాడుతూ మొక్కజొన్నలో అక్కడక్కడా ఫాల్ ఆర్మీవామ్(కత్తెర పురుగు) కనపడుతుందని చెప్పారు. నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్.సుభాని, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లిక సాంబశివరావు, కిరణ్ పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



ఫిరంగిపురం: దీక్షలో ఉన్న అయ్యప్పస్వాములు గురువారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఉదయాన్నే నగరేశ్వరస్వామి సన్నిధిలో అర్చకులు వి.రాజేంద్రశర్మ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అనంతరం మాలధారణ చేసిన 12 మంది అయ్యప్పలకు ఇరుముడి పూజలు చేసి, ధారణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆవు పొడిచి మహిళ మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనకొండలో నివాసం ఉండే మహిళను గురువారం ఆవు పొడవడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై కోటయ్య వివరాల ప్రకారం కొలనకొండలో నివాసం ఉండే చింతమనేని శ్రీహరిరావు భార్య పార్వతి (59) ఉదయం ఇస్కాన్ టెంపుల్‌లోని ఆవుకు అరిపండ్లు తినిపిస్తున్న సమయంలో పొడిచింది. పార్వతికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందింది. ఘటనపై శ్రీహరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థి ఎంపిక

మంగళగిరి: నూతక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.వెంకట పుష్పలత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అంతరాష్ట్ర వాలీబాల్ పోటీల్లో.. గుంటూరు జిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 9వ వ తరగతి విద్యార్థినిని పీడీ రజనీనాయక్, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి మండలం కొలకలూరు రైల్వేస్టేషన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. కొలకలూరుకు చెందిన మోదుకూరు విజయ్ కుమార్(45) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఉదయాన్నే పనుల నిమిత్తం బయటకు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్ని దుస్తులకు యమ డిమాండ్

జోరుగా విక్రయాలు



ఉన్ని దుస్తులు అమ్ముతున్న వ్యాపారి

తాడేపల్లిరూరల్ : చలి వణికిస్తోంది. ఎన్నడూ లేనంతగా గజగజలాడిస్తోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ హడలెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారులు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని, ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. ఇక్కడ రూ.200 నుంచి రూ.3 వేల వరకు విలువైన ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. స్వెట్టర్లతో పాటు ఉన్ని దుప్పట్లు, మంకీ క్యాప్‌లు రకరకాల రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. సుమారు 10 సంవత్సరాల నుంచి చలికాలంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు.

జోరుగా విక్రయాలు....

వాతావరణం మారి చలి పెరగడంతో వెచ్చని దుస్తులకు డిమాండ్ ఏర్పడింది. కొనుగోళ్లు కూడా జోరుగా సాగుతున్నాయి. చలిగాలిలో ఎక్కువగా తిరిగితే రోగాల బారిన పడే అవకాశం ఉంది. చలికి రక్త నాళాలు మూసుకుపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చలిలో ఎక్కువగా తిరగకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చలిగాలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులను వినియోగించాలని చెబుతున్నారు. శరీరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు ఉపయుక్తంగా ఉంటాయి. తలకు టోపీలు, స్వెట్టర్లు వేసుకుని బయటకు వెళ్లేవారు చలి నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది.

ఉన్ని దుస్తులు తప్పనిసరి



తెల్లవారుజామునన పొలానికి వెళ్లి గేదెలకు గడ్డి కోయాలి. ఆ సమయంలో పొలానికి వెళితే విపరీతమైన మంచు కురిసి జలుబు చేసి, జ్వరం వస్తుంది. చలికోటు అనేది తప్పని సరిగా అవసరం అవుతోంది. వయసు పెరుగుతున్న కొద్దీ పొగ మంచుకు తిరగాలంటే ఉన్ని దుస్తులు తప్పనిసరి.

– గూడూరు ధనలక్ష్మి, రైతు, ఉండవల్లి

చలిలో తిరగరాదు



శీతాకాలంలో చలిలో ఎక్కువగా తిరగడం అంత మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో చలిగాలిలో తిరిగే సమయంలో ఉన్ని స్వెట్టర్లు ధరించాలి. చెవుల్లోకి చలిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. చలిలో తిరిగిన సమయంలో జలుబు వచ్చి అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ మానస, వైద్యులు, అర్బన్ హెల్త్ సెంటర్

ఒత్తిడి లేని విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



డాక్టర్ ప్రత్యూష సుబ్బారావును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తాడేపల్లిరూరల్: ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీలో ప్రథమ సంవత్సరం బీ ఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ శౌరీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి లేకుండా సానుకూల వాతావరణం కల్పించి, వారి విద్యా ప్రయాణానికి మద్దుతు అందించేలా సూచనలు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ప్రేరణాత్మక సందేశాలిచ్చారు, క్రమశిక్షణతో సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలని చైతన్యపరిచారు. కళాశాల రెగ్యులేటరీ అఫైర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్కే ఆశా బేగం, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాములరెడ్డి, డాక్టర్ యు.స్పందన, డాక్టర్ నరసింహనాయక్, జి.సాయి, శ్రీలక్ష్మి, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ రసాయనిక సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో 5వ అంతర్జాతీయ రసాయనిక సదస్సు ఐకానిక్ ప్యాక్ – 2025 గురువారం నిర్వహించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తు సెన్సార్లు, బయో సెన్సార్లు అనే అంశంపై ఈ సదస్సును నిర్వహించామని తెలిపారు. ఈ సదస్సుకు మద్రాస్ ఐఐటీ నుంచి సురేష్ కుమార్ రాయల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాబోయే కాలంలో వివిధ అనారోగ్య సమస్యలను గుర్తించడానికి, కాపాడడానికి బయో సెన్సార్లు చాలా ముఖ్యమైనవన్నారు. పరిరక్షణ నుంచి పారిశ్రామిక అనువర్తనాల వరకు వివిధ రంగాల్లో పురోగతి సాధించడానికి బయో సెన్సార్లు ఉపయోగపడతారని వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం ఇతర విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దేశ సమైక్యత, మత సామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో పయనిద్దాం అంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్‌లో గురువారం కరపత్రాల పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఎం.రవి మాట్లాడుతూ ప్రగతి బాటలో 2025లో ముందుడుగు వేద్దామని అన్నారు. మణిపూర్ అగ్నికి ఆహుతి అవుతున్నా ఆ రాష్ట్రం వైపు చూసే తీరిక లేకుండా విదేశ పర్యటనలో పాలకులు మునిగి తేలుతున్నారని విమర్శించారు. మణిపూర్ ఘటనలను ఖండించడానికి కూడా ప్రధానికి నోరు రావడం లేదని అన్నారు. పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని, పేదరికం, ప్రజల బాధలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం. భాగ్యరాజు, టి. బక్కిరెడ్డి, సంకురు ఇమ్మానియేల్, ఈమని రామారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సీహెచ్ సుందరరావు, పేరం బాబూరావు, కుంభ ఆంజనేయులు పాల్గొన్నారు.

'మీ సంరక్షణ – మా సంకల్పం'



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు ఎన్.నాగలక్ష్మి, బి.లలిత కుమారి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య కళాశాలలో గురువారం విద్యార్థులకు మహిళా మీ కోసం అనే కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంగళగిరి డీఎస్పీ కార్యాలయానికి చెందిన మహిళా పోలీసులు ఎన్.నాగలక్ష్మి, బి.లలితకుమారి మాట్లాడుతూ గత నవంబరులో గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ 'మీ సంరక్షణ మా సంకల్పం' అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, కుటుంబ సమస్యలు మొదలైన కేసులు పరిష్కరించబడతాయని వివరించారు. అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా ప్రయాణించాల్సి వస్తే బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి గానీ 97464 14841 నంబర్‌కు ఫోన్ చేస్తే దగ్గరలో ఉన్న కానిస్టేబుళ్లు వారిని క్షేమంగా ఇంటికి చేరుస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో కేవలం గుంటూరు జిల్లాకే పరిమితం అని తెలిపారు. కేఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సరళాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు సిబ్బంది తెలిపారు.

కృత్రిమ మేథపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు

మోతడక(తాడికొండ): ఏఐ, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్‌లో సాంకేతికతను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఏఐ, ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరగనున్న కృత్రిమ మేధ వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించి, మాట్లాడారు. 2025 సంవత్సరాన్ని ఏఐ సంవత్సరంగా అకిల భారత సాంకేతిక విద్యా మండలి ప్రకటించినట్లు చెప్పారు. అన్ని రంగాలలో విద్యార్థులను నైపుణ్యం గల నిపుణులుగా మార్చాలనే లక్ష్యంతో ఏఐ సీటీఈ అడుగులు వేస్తుందన్నారు. విశిష్ట అతిథి కో-మాక్స్ సొల్యూషన్ సీఈవో, డేటా సైంటిస్ట్ బి.శ్రీకాంత్ భవిష్యత్తులో విద్యార్థులు కృత్రిమ మేథపై అవగాహన పెంపొందించుకునేందుకు ఏఐ, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్, రియల్ టైం సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డీన్‌లు డాక్టర్ పి.ఫణికుమార్, డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ బాల మురళీ కృష్ణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

తాడికొండ రెవెన్యూ సదస్సుకు 24 అర్జీలు



సమస్యలు వింటున్న తహసీల్దారు కె.నాసరయ్య

తాడికొండ: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 24 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు కె.నాసరయ్య తెలిపారు. ఇందులో అడంగల్ చేర్పులు, పాసు పుస్తకం కోసం 9 అర్జీలు రాగా 11 సర్వే సంబంధిత సమస్యలు, 3 అర్జీలు దేవదాయ, వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన సమస్యలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హనుమంతరావు, కార్యదర్శి హరిబాబు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సిరిపురంలో రెవెన్యూ గ్రామ సభ

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ కార్యక్రమం అధికారులు నిర్వహించారు. పాస్ పుస్తకాలు కూడా తప్పుల తడకగా నమోదు చేశారని వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ప్రజలు కోరారు. తహసిల్దార్ ఎం.హరిబాబు మాట్లాడుతూ గ్రామ సభ ముఖ్య ఉద్దేశం రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేయుడమేనన్నారు.

5న ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఆత్మీయ సమావేశం

తెనాలి: 'ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ లెక్చరర్స్ సమస్యలు–పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఈనెల 5న గుంటూరులో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు అరండల్‌పేట 4/1లోని గీతాకేఫ్ ఎదురు సాయంత్రం 5 గంటల నుంచి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎస్టీయూ, ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు, వివిధ కళాశాలలకు చెందిన ప్రైవేట్ లెక్చరర్లు, గెస్ట్ లెక్చరర్లు జిల్లావ్యాప్తంగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమస్యలపై చర్చించిన తదుపరి నివేదికను తయారుచేసి కచ్చితంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వివరించారు. ఉపాధ్యాయులకు ఉపకరించే సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని వేణుగోపాల్ కోరారు.

దట్టమైన పొగమంచు



మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రహదారిలో దట్టంగా ఉన్న పొగమంచు



తాడేపల్లి 1వ వార్డు నుంచి పొగమంచుతో కనిపించని విజయకీలాద్రి పర్వతం



రహదారిపై లైట్ల వెలుతురులో వెళ్తున్న బస్సులు



ప్రకాశం బ్యారేజ్‌పై

తాడేపల్లిరూరల్/ఫిరంగిపురం : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి, దుగ్గిరాల మండలంలో గురువారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు ఎండ రాకపోవడంతో ఆయా రహదారుల్లో ప్రయాణం చేసే వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంవత్సరం మొట్టమొదటిసారిగా ఇంత భారీస్థాయిలో పొగమంచు కురిసిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారిపై రెండురోజులుగా పొగమంచు పూర్తిగా కమ్మేసింది. రహదారిపై ఎదురు ఎదురుగా వచ్చే వాహనం కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది.

ద్విచక్ర వాహనాలు ఢీ



రాయపూడి(తాడికొండ): రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డుపై గురువారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వడ్డమాను గ్రామానికి చెందిన కృపారావు తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు, ఇతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లింగాయపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళకు కాలు విరగడంతో ఆసుపత్రికి తరలించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మోతడక(తాడికొండ): ఎస్టీయూ ఆధ్వర్యంలో మోతడక శ్రీరామా ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ఎంఈవో తెనాలి ఇందిర మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి ఎస్టీయూ యూనియన్ సూక్ష్మీకరించిన ముఖ్య విషయ పరిజ్ఞాన పుస్తకం 152 పేజీలతో రూపొందించి అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఉండవల్లి నరసింహారావు, హెచ్ఎం ఆదెమ్మ, ఎస్టీయూ అధ్యక్షులు ఆరుద్ర వీరయ్య, ప్రధాన కార్యదర్శి బి.కృష్ణారెడ్డి, ఎస్.గోపీకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదు



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను గత 30 సంవత్సరాలకు పైబడి పరిష్కరించకపోవడం పాలక పక్షాల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందని సీఐటీయూ తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ లాకౌట్ అయ్యి.. 30 ఏళ్లు అవుతోందని, ఇప్పటికే 160 మందికి పైగా కార్మికులు చనిపోయారని తెలిపారు. వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరారు. దీక్షలో రమాదేవి, శారమ్మ, లక్ష్మి, సామ్రాజ్యం, దీనమ్మ కూర్పొనగా, కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, సూర్యప్రకాష్, అంకయ్య సాంబయ్య, నవనీతం సంఘీభావం తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సైబర్ క్రైమ్ అవగాహనా సదస్సులో సీఐ కె.వాసు



మాట్లాడుతున్న తాడికొండ సీఐ కె.వాసు

మోతడక(తాడికొండ): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన పెంచుకొని తమవంతు ప్రచారం చేయడం ద్వారా నియంత్రణకు అడ్డుకట్ట వేయవచ్చని తాడికొండ సీఐ కె.వాసు అన్నారు. గురువారం తాడికొండ బస్టాండ్‌లో సైబర్ క్రైమ్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమైన ఆయన నేడు పెరుగుతున్న డిజిటల్ వినియోగంలో భాగంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ కొనుగోళ్లు, నగదు లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ సీక్రెట్ పిన్‌కోడ్ నంబర్లు, ఓటీపీ ఎవరికీ షేర్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వీడియోను ప్రదర్శించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట ఎలా వేయాలి అనే విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు అడిగిన పలు ప్రశ్నలను నివృత్తి చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మోసాలపై నిర్వహిస్తున్న ఈ సదస్సులు తమకు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) క్యాలెండరును తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ భాషా మౌఖిక ఆదేశాల ప్రకారము తెనాలి, దుగ్గిరాల యూనిట్ల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సంఘ క్యాలెండర్‌లో ప్రభుత్వ సెలవు దినాలు, ఐచ్ఛిక సెలవుదినాలను ఇవ్వటం వల్ల, ఉద్యోగులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులందరూ స్నేహపూర్వకంగా సోదర భావంతో కలసిమెలసి క్యాలెండరును రూపొందించుకోవటం సంతోషంగా ఉందన్నారు. దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి, ఉపాధ్యక్షుడు వంకదార సుబ్బారావు, తెనాలి యూనిట్ సహాధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దగ్గుబాటి సుధీర్, కార్యదర్శి కారుమూరు కమలకుమారి, కోశాధికారి గైరుబోయిన విజయలక్ష్మి, దుగ్గిరాల యూనిట్ కార్యదర్శి గుంటూరుపూర్ణప్రసాద్, సభ్యులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.